1st Happy Work Anniversary. Year

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 199 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 14 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 199 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 14 June 2025 PAGES : 8 PRICE : 3/-

## ప్రజలకు సాంకేతికత ఫలాలు



**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 13)**

ఎన్డీయే ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు అనేక ప్రయోజనాలను చేకూర్చామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "ఆవిష్కరణలు, సాంకేతికతను ఉపయోగించడంలో భారత యువశక్తితో విశేషమైన పురోగతి సాధించాం. ప్రపంచ సాంకేతిక శక్తిగా, స్వయంశక్తిగా ఎదిగేందుకు చేస్తున్న మా ప్రయత్నాలకు ఇది మరింత దోహదపడింది. లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు అందించడానికి, అందులో పారదర్శకతకు సాంకేతికత గొప్పగా సహాయపడింది. పేదలు స్వయం సాధికారత సాధించేందుకు కూడా ఇది ఉపయోగపడింది" అని పేర్కొన్నారు. దాదాపు 322 పథకాల కింద రూ.44 లక్షల కోట్లను ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా లబ్ధిదారులకు ఎన్డీయే ప్రభుత్వం పారదర్శకంగా అందించినట్లు ప్రభుత్వ అధికారిక 'ఎక్స్' ఖాతా ఈ సందర్భంగా పేర్కొంది. లీకేజీలను అరికట్టడం ద్వారా మరో రూ.3.48 లక్షల కోట్లను ఆదా చేసినట్లు తెలిపింది. మోదీ నాయకత్వంలో డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా, సాంకేతికత ఆధారిత పరిపాలనగా, ప్రపంచ విశ్వాసంగా భారత్ మారిందని.. తయారీరంగం నుంచి అంతరిక్ష సాంకేతికత వరకు, సాంకేతిక చెల్లింపుల విధానం నుంచి గ్రామీణ అనుసంధానం వరకు మార్పు ప్రభావవంతంగా కనిపిస్తోందని పేర్కొంది.

## వైకాపా ఆ వ్యాఖ్యలు విత్‌డ్రా చేసుకోకపోతే

# న్యాయపోరాటం



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 13)**

తల్లికి వందనంలో రూ.13వేలు ఇచ్చి రూ.2వేలు నా ఖాతాల్లో పడ్డాయన్న వైకాపా నేతలకు తీవ్ర పరిణామాలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. రూ.2వేలు నా ఖాతాలో పడినట్టు రుజువు చేయాలి, లేకుంటే క్షమాపణ చెప్పి.. ప్రకటన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే వారిపై చట్టప్రకారం ముందుకెళ్తానని తేల్చి చెప్పారు. అసత్య ఆరోపణలని గతంలో మాదిరి ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేసేవారు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలోని 80శాతం మంది పాఠశాల విద్యార్థులకు కిట్‌లు అందించామని లోకేశ్ తెలిపారు. "స్కూళ్లు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు అందించాం. మిగిలిన 20శాతం మందికి ఈనెల 20వ తేదీ లోపు అందిస్తాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తాం. కొందరి ఖాతాలు యాక్టివ్ లేక నిధులు తిరిగి వచ్చాయి. ఆయా ఖాతాలు యాక్టివ్ చేసుకోవాలని తల్లులను కోరుతున్నాం. ఖాతాలు యాక్టివ్ అయ్యాక తల్లికి వందనం నగదు వేస్తాం. మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించాం. 9,600 పాఠశాలల్లో వన్ క్లాస్- వన్ టీచర్ మోడల్ తీసుకొచ్చాం. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ -మిగతా 2లో

## నిజాయతీపరులైన జర్నలిస్టులకు ఈ తీర్పు వజ్రాయుధం లాంటిది: రోజా

- ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టులో ఊరట
- కొమ్మినేని అరెస్ట్ అక్రమమని తేల్చిన సర్వోన్నత న్యాయస్థానం
- ఆయన్ను వెంటనే విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ
- విశ్లేషకుడి వ్యాఖ్యలతో కొమ్మినేనికి సంబంధం లేదని కోర్టు స్పష్టీకరణ
- సుప్రీం తీర్పుపై వైసీపీ నేత రోజా హర్షం, రాజకీయ విమర్శలు
- నిజాయతీపరులైన జర్నలిస్టులకు ఇది వజ్రాయుధం వంటి తీర్పని రోజా వ్యాఖ్య



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 13)**

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టులో శుక్రవారం నాడు ఊరట లభించింది. ఆయన అరెస్ట్‌ను అక్రమమైనదిగా సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అంతేకాకుండా, శ్రీనివాసరావును తక్షణమే విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలతో కొమ్మినేనికి ఎటువంటి సంబంధం లేదని కూడా న్యాయస్థానం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ పరిణామంపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని గారి అరెస్ట్‌ను అక్రమమని సుప్రీంకోర్టు తేల్చింది. వెంటనే విడుదల చేయాలంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విశ్లేషకుడి వ్యాఖ్యలతో సంబంధం లేదంటూ న్యాయస్థానం స్పష్టంగా పేర్కొంది. వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం రక్షణపై ఇది గట్టి సందేశం. సాక్షి టీవీపై విషప్రచారం చేసిన పచ్చ మీడియాకు చెంపదెబ్బ వంటిది. రెడ్ బుక్ రాజకీయాలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. నిజాయతీపరులైన జర్నలిస్టులకు ఇది వజ్రాయుధంలాంటి తీర్పు" అని రోజా తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## అందుకే నాకు మంటలు అంటుకోలేదు విమాన ప్రమాద మృత్యుంజయుడు విశ్వాస్

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 13)**

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం నుంచి అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డారు విశ్వాస్‌కుమార్ రమేశ్. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. ప్రమాద క్షణాలను (%జురిజీ ।దీఖిరిబి ఆజిబిదీలి ్రజీబిరీనీ%) గుర్తుచేసుకున్నారు. విమానం కూలగానే తాను కూర్చున్న సీటు ఊడి పడిందని, అందువల్లే తాను బతికిబయటపడ్డానన్నారు.

"నేను విమానం నుంచి దూకలేదు. టేకాఫ్ అయిన కాసేపటికే విమానం ముక్కలైంది. నా సీటు విరిగిపోవడంతో దూరంగా ఎగిరిపడ్డా. అందుకే విమానంలో చెలరేగిన మంటలు నాకు అంటుకోలేదు" అని విశ్వాస్ కుమార్ చికిత్స సమయంలో వైద్యులకు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆయన శరీరంపై -మిగతా 2లో



## జీఎస్ఐ జాబితాలో బెలూం గుహలు.. హర్షం వ్యక్తం చేసిన మంత్రి దుర్గేష్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 13)**

భౌగోళిక వారసత్వ జాబితాలో ప్రఖ్యాత బెలూం గుహలకు గుర్తింపు దక్కడంపై పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలోని బెలూం గుహలకు జీఎస్ఐ ప్రత్యేక గుర్తింపునివ్వడం సంతోషకరమన్నారు. పురాతన సంస్కృతికి నిలయాలు ఈ బెలూం గుహలని పేర్కొన్నారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటనతో పర్యాటకంగా ఈ ప్రాంతానికి మరింత ప్రాచుర్యం లభిస్తుందని మంత్రి తెలిపారు. జీఎస్ఐ జాబితాలో చోటు దక్కడం వల్ల బెలూం గుహలు మరింత అభివృద్ధికి నోచుకోనున్నాయన్నారు. ప్రపంచంలో రెండోది, దేశంలోనే



పొడవైన అంతర్భాగ గుహలుగా బెలూం గుహలు ప్రసిద్ధి చెందాయని వ్యాఖ్యానించారు. దేశ పర్యాటక ప్రదేశాల్లో రాష్ట్రంలోని బెలూం గుహలకు స్థానం దక్కుతుందని అన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా మరింత ప్రచారం కల్పిస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోందని మంత్రి దుర్గేష్ అన్నారు.

## ఖాతాల్లో 'తల్లికి వందనం' డబ్బులు పడుతున్నాయ్.. తెదేపా పోస్ట్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 13)**

ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం'నిధులు విద్యార్థుల తల్లులు, సంరక్షకుల ఖాతాలో జమ అవుతున్నాయి. ఈ మేరకు సోషల్ మీడియాలో తెదేపా (%ఊఈఆ%) పోస్ట్ చేసింది. "చెప్పిన విధంగా.. ఇచ్చిన మాట ప్రకారం ఖాతాల్లో 'తల్లికి వందనం' డబ్బులు పడుతున్నాయి" అని ఆ పార్టీ పేర్కొంది. ఇద్దరు పిల్లలు ఉన్న ఓ లబ్ధిదారు ఖాతాలో రూ.26 వేలు పడ్డాయని పేర్కొంటూ బ్యాంకు నుంచి మొబైల్‌కు వచ్చిన మెసేజ్‌ను తెదేపా పోస్ట్ చేసింది. మరో రూ.4 వేలు స్కూల్ ఖాతాలో పడ్డాయని తెలిపింది.

'తల్లికి వందనం' పథకాన్ని గురువారం నుంచి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 35,44,459 మంది ఖాతాల్లో నిధులు జమచేస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఒక్కో విద్యార్థికి రూ.15వేల చొప్పున విడుదల చేసింది. ఇందులో రూ.13వేలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు, మిగతా రూ.2వేలను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కలెక్టర్ల ఖాతాలకు జమచేస్తున్నారు.



## అహ్మదాబాద్ విమాన ప్రమాదం

# 1000 డిగ్రీల వేడితో మంటలు

**అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా విమానం, భారీ అగ్నిప్రమాదం**

**ప్రమాద స్థలంలో 1000 డిగ్రీల సెల్సియస్‌కు చేరిన ఉష్ణోగ్రతలు**

**విమానంలో లక్షా 25 వేల లీటర్ల ఇంధనం, వేగంగా వ్యాపించిన మంటలు**

**సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం, ఎవరినీ కాపాడలేని పరిస్థితి**

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 13)**

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. ఈ దుర్ఘటనకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన తీరు, అనంతర పరిణామాలపై మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. విమానం కూలిపోయిన ప్రదేశంలో దాదాపు 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు ఎగిసిపడ్డాయని, సహాయక చర్యలు చేపట్టడం అత్యంత క్లిష్టతరంగా మారిందని అధికారులు తెలిపారు.ఈ విమానంలో సుమారు 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, అది పేలి మంటలు తీవ్రంగా వ్యాపించడంతో ఎవరినీ రక్షించే అవకాశం లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇదివరకే వెల్లడించారు. ఘటనపై ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఒకరు మాట్లాడుతూ, "ప్రమాద సమాచారం అందిన వెంటనే మధ్యాహ్నం 2 నుంచి 2:30 గంటల సమయంలో మా బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అప్పటికే స్థానికులు కొందరు హాస్టల్ శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడారు. అయితే, మంటలు తీవ్రంగా వ్యాపించడంతో పరిస్థితి అదుపు తప్పింది" అని వివరించారు.



మరో అధికారి ప్రమాద స్థలంలోని భయానక వాతావరణాన్ని వివరిస్తూ, "మేము గతంలో అనేక సహాయక చర్యల్లో పాల్గొన్నాం, కానీ ఇంతటి విపత్తును ఎప్పుడూ చూడలేదు. విమాన ఇంధన ట్యాంక్ పేలిపోవడంతో పెద్ద అగ్నిగోళంలా మారింది. క్షణాల్లోనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీంతో ఎవరూ బయటపడే మార్గం లేకుండా పోయింది. మేము పీపీఈ కిట్లు ధరించి ఘటనా స్థలానికి వెళ్లినా, వేడి తీవ్రత అధికంగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఆ ప్రాంతంలోని పక్షులు, కుక్కలు కూడా తప్పించుకోలేనంత వేగంగా ఉష్ణోగ్రత పెరిగింది. ప్రమాద స్థలంలో అనేక పక్షులు, శునకాలు కాలి బూడిదయ్యాయి. ఎటు చూసినా శిథిలాలే కనిపించాయి. వాటి కింద తీవ్రంగా కాలిపోయిన ప్రయాణికుల మృతదేహాలను గుర్తించడం సవాలుగా మారింది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

## సత్యమేవ జయతే..! కొమ్మినేని కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై వైయస్ జగన్

**ఇది చంద్రబాబు నిరంకుశత్వానికి చెంప పెట్టు**

**కొమ్మినేనికి సంబంధం లేని వ్యాఖ్యలు ఆపాదించారు**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 13)**

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో సీనియర్ పాత్రికేయుడు, సాక్షి చానల్ న్యూస్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. "సత్యమేవ జయతే" అంటూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు గారిని వెంటనే విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు చంద్రబాబు గారికి పెద్ద చెంపపెట్టు. నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు న్యాయస్థానం గట్టిగా బుద్ధిచెప్పింది. ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు ఈ అరెస్టు తీవ్ర భంగకరమని కోర్టు చెప్పడం ముదావహం. అమరావతి నిర్మాణం పేరిట వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ -మిగతా 2లో



మొదటి పేజీ తరువాయి

### వైకాపా ఆ వ్యాఖ్యలు విత్‌డ్రా చేసుకోకపోతే
## న్యాయపోరాటం

అంటే ఏంటో ఏడాదిలో చూపిస్తాం. ప్రభుత్వ పాఠశాలలు అన్నింటికీ ఉచిత కరెంట్ ఇస్తున్నాం. సోమవారం నాటికి ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేస్తాం. మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ బడుల్లో నాణ్యత పెంచాలనేదే మా లక్ష్యం. అంగన్వాడీ పిల్లలకు తల్లికి వందనం వర్తించదు. వైకాపా హయాంలో విద్యాశాఖను నాశనం చేశారు. గతంలో విద్యాశాఖ మంత్రి ఏం చేశారో మాకు తెలియదు. ప్రభుత్వ బడుల్లో ఎంతమంది చదువుతున్నారో తెలుసుకునేందుకు వందరోజులు పట్టింది” అని మంత్రి లోకేశ్ అన్నారు.

## అందుకే నాకు మంటలు అంటుకోలేదు
## విమాన ప్రమాద మృత్యుంజయుడు విశ్వాస్

పలుచోట్ల గాయాలు అయ్యాయి. వాటినుంచి కోలుకుంటున్న ఆయన మాట్లాడారు.

**ఆసుపత్రిలో విశ్వాస్ కుమార్‌ను పరామర్శిస్తున్న ప్రధాని మోదీ**

“అంతా నా కళ్ల ముందే జరిగింది. ఎలా బతికానో నాకే అర్థం కాలేదు. విమానం కింద పడగానే నేను కూడా చనిపోయానని అనుకున్నా. కళ్లు తెరిచి చూసేసరికి హాస్టల్ భవనం శిథిలాల్లో ఉన్నా. శిథిలాల నుంచి మెల్లగా నడుచుకుంటూ వెళ్లా. మంటల ధాటికి నా ఎడమ చేయికి గాయమైంది” అని విశ్వాస్ తెలిపారు. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ ప్రయాణికుడిని శుక్రవారం ప్రధాని మోదీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్వాస్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్‌కుమార్.. గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలోని 11-ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. విశ్వాస్ ఒక్కడే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఈ ప్రమాదం వల్ల బీజే వైద్య కళాశాల వసతిగృహంలో మరో 24 మంది మృతి చెందారు.

## సత్యమేవ జయతే..!
### కొమ్మినేని కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై వైయస్ జగన్

పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి తన ఎల్లో ముఠాతో కలిసి చంద్రబాబుగారు కృత్రిమ వివాదాన్ని సృష్టించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలననుంచి మళ్లించడానికి, తాను చేయని వ్యాఖ్యలను కొమ్మినేని గారికి ఆపాదించి, దానిచుట్టూ తన ఎల్లో గ్యాంగ్‌ద్వారా పథకం ప్రకారం విషప్రచారం చేయించారు. వాటిని పట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా రౌడీయిజం చేశారు, ఆస్తులను ధ్వంసం చేశారు. మహిళల నిరసన పేరుతో ఒక ముసుగు వేసుకుని సాక్షి మీడియా యూనిట్ ఆఫీసులమీద, కార్యాలయాలమీద అరాచకంగా దాడులు చేయించారు. మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు.

చంద్రబాబుగారు తన తప్పును తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైసీపీకి, సాక్షి మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా మాట్లాడ్డంతోనే ఆయన రాజకీయ లబ్ధికోసం ఈ కుట్రపన్నారని అర్థం అవుతోంది. యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని గారికి విశ్లేషకుడి వ్యాఖ్యలతో ఏం సంబంధం అంటూ? ఇవాళ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ చంద్రబాబు కుట్రను బద్దలు చేసింది, ఎండగట్టింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటు కావు.... సత్యమేవ జయతే” అంటూ జగన్ పేర్కొన్నారు.

# విధ్వంసం ఆపాలంటే డీల్ చేసుకోండి.. ఇరాన్‌కు ట్రంప్ కీలక సూచన!



**ఇరాన్‌కు ఇది రెండో అవకాశం.. అణు ఒప్పందం చేసుకోవాలన్న ట్రంప్**
**లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక**
**ట్రూత్ సోషల్ మీడియాలో ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ పోస్ట్**
**ఇజ్రాయెల్ దాడులు సూపర్ అంటూ ప్రశంసలు**
**ఇరాన్ అణు కార్యక్రమంపై ప్రపంచ దేశాల ఆందోళన**

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 13)**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఇటీవల జరిపిన సైనిక దాడులు, టెహ్రాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి ఒక కొత్త అవకాశాన్ని సృష్టించాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం ఇరాన్ నాయకులకు మరిన్ని విధ్వంసాలను నివారించడానికి లభించిన రెండో అవకాశం అని ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్‌లోని పలు అణు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ భారీ దాడులు చేసిన నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరిన తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరాన్ తన అణు కార్యక్రమంపై తక్షణమే ఒక ఒప్పందానికి రావాలని, తద్వారా హింస మరింత పెరగకుండా ఆపాలని ట్రంప్ కోరారు. “ఇరాన్ సామ్రాజ్యంగా ఒకప్పుడు పిలవబడిన దానిని కాపాడుకోవడానికి, ఏమీ మిగలకుండా పోయేలోపే ఇరాన్ ఒక ఒప్పందం చేసుకోవాలి” అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో రాశారు. “ఇక మరణాలు వద్దు, విధ్వంసం వద్దు, ఆలస్యం కాకముందే దీన్ని చేయండి” అంటూ ఈ సమయం చాలా కీలకమైనదని ఆయన నొక్కిచెప్పారు. గతంలో ఇరాన్‌కు ఒప్పందం కుదుర్చుకోవడానికి 60 రోజుల గడువు ఇచ్చినట్లు ట్రంప్ గుర్తుచేశారు. చర్చలకు సమయం వేగంగా ముగిసిపోతోందని ఆయన సూచించారు. ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో ట్రంప్ ఇజ్రాయెల్ దాడులను అద్భుతమైనవి అని ప్రశంసించారు. ఇరాన్ తన అణు ఆశయాలను పునఃపరిశీలించకపోతే మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఇజ్రాయెల్ దాడి అనంతరం ఏర్పడిన పరిస్థితులను ఉపయోగించుకుని, ఇరాన్‌ను తిరిగి చర్చల వేదికపైకి తీసుకురావడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడానికి తన జాతీయ భద్రతా సలహాదారులతో సమావేశమైన ట్రంప్, ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఉంటుందన్నారు. చర్చలకు నిరాకరిస్తే ఇరాన్ మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇజ్రాయెల్ దాడుల తీవ్రత, ట్రంప్ బహిరంగ జోక్యం నేపథ్యంలో ఇరాన్ అణు కార్యక్రమం భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. టెహ్రాన్ ప్రతిస్పందన కోసం ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# జగన్... నా నుంచి నీకు మరో సవాల్ : నారా లోకేశ్

**వైసీపీ అధినేత జగన్‌కు ఏపీ మంత్రి నారా లోకేశ్ సవాల్**
**తల్లికి వందనం పథకంపై తనపై ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆరోపణ**
**పథకం డబ్బులు తన అకౌంట్‌లో పడుతున్నాయనడం అబద్ధమని వెల్లడి**
**ఆరోపణలు నిరూపించడానికి 24 గంటల సమయం ఇస్తున్నట్లు ప్రకటన**
**లేదంటే స్టేట్‌మెంట్ వెనక్కి తీసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలని హెచ్చరిక**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 13)**

ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్ కు తీవ్రస్థాయిలో సవాల్ విసిరారు. తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తల్లికి వందనం’ పథకానికి సంబంధించి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని లోకేశ్ ఆరోపించారు. “జగన్... నా నుంచి నీకు మరో సవాల్. తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు లోకేశ్ అకౌంటులో పడుతున్నాయని ఫేక్ ప్రచారం చేస్తున్నారు... ఈ ఆరోపణలను నిరూపించడానికి 24 గంటల సమయం ఇస్తున్నాను... దమ్ముంటే నిరూపించాలి” అని లోకేశ్ సవాల్ చేశారు. ఒకవేళ ఈ ఆరోపణలను నిరూపించలేకపోతే, చేసిన ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకుని, జరిగిన తప్పును అంగకరించాలని లోకేశ్ డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో, చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ రకమైన అసత్య ప్రచారాలను ఇకపై సహించేది లేదని స్పష్టం చేశారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. నేటి నుంచి తల్లుల ఖాతాలో నగదు జమ అవుతోంది. తల్లికి వందనం పథకంలో అందించే నగదు రూ.15 వేలు కాగా, ఇందులో రూ.13 వేలు విద్యార్థి తల్లి ఖాతాలో జమ అవుతుంది. మిగిలిన 2 వేలు పాఠశాల/కాలేజీ విద్యాభివృద్ధి నిధి నిమితం ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ అవుతాయి. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది.



# దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అమరిక




**వెలుగు, అమరావతి, జూన్ 13)**

శ్రీపాదం పేరుతో తెలుగు రాష్ట్రాల్లోని 127 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అమర్చే శిబిరం శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో ప్రారంభమైంది. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, జూబ్లీహిల్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. కాళ్లు కోల్పోయిన వారిని గుర్తించి, వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు కృత్రిమ కాళ్లు అమర్చే శిబిరాన్ని చేపట్టామన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్ష, కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహనరావులు మాట్లాడుతూ రూ.24 లక్షలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ.12 లక్షలు వితరణగా అందజేసిందని తెలిపారు. తొలిరోజు 55 మందికి కృత్రిమ కాళ్లను అమర్చినట్లు, మరో రెండు రోజులు ఈ సేవలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాలకోటిరెడ్డి, కమలాకర్, ప్రాజెక్ట్ ఛైర్మన్ అనిల్ చక్రవర్తి, దామర్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ పోటీలకు ఐఐటీఎం సౌర కారు

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 13)**

ఆస్ట్రేలియాలో జరిగే బ్రిడ్జ్‌స్టోన్ వరల్డ్ సోలార్ ఛాలెంజ్‌లో పోటీపడేందుకు ఐఐటీ మద్రాస్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ (సీఎఫ్ఐ) సోలార్ పవర్డ్ కారు ‘ఆగ్నేయ’ను అభివృద్ధి చేసింది. విద్యార్థులు అగ్నిరథ్ పేరిట బృందంగా ఏర్పడి డీన్ (విద్యార్థులు) ప్రొఫెసర్ సత్యనారాయణ ఎన్.గుమ్మడి, ఫ్యాకల్టీ అడ్వైజర్ ప్రొఫెసర్ ఎం.ఎస్.శివకుమార్, స్పాన్సర్ల సాయంతో ఈ కారు రూపొందించారు. దీన్ని శుక్రవారం ఐఐటీఎం సంచాలకుడు ప్రొఫెసర్ వి.కామకోటి ఆవిష్కరించారు. ఈ జట్టు కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అగ్నిరథ్ బృందానికి నాయకత్వం వహించిన విద్యార్థి సాయిరామ్ మాట్లాడుతూ... ఆగస్టు 24 నుంచి 31వ వరకు జరిగే బ్రిడ్జ్‌స్టోన్ వరల్డ్ ఛాలెంజ్ కేవలం ఓ రేసు మాత్రమే కాదని, అత్యంత డిమాండ్ ఉన్న ఇంజినీరింగ్ పోటీ అని తెలిపారు. కారు తయారీకి తమ బృందం 15 వేల గంటలకుపైగా కష్టపడిందని వివరించారు. వాహన బరువు తగ్గించడానికి కార్బన్ ఫైబర్ ఉపయోగించినట్లు తెలిపారు.



షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 14.06.25 శనివారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ప్రాధాన్యత, ప్రాధాన్యత లేని రంగాలకు రుణాలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 13)

ప్రాధాన్యత రంగాలు, ప్రాధాన్యత లేని రంగాలకు 2025-26 ఆర్థిక సంవత్సరములో విస్తృతంగా రుణాలు ఇవ్వాలని వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు నూరు శాతం చేరుకోవాలని కలెక్టర్ అన్నారు. గత ఏడాదిలో రైతులకు ఒక లక్ష సీసీఆర్సి కార్డులు జారీ చేయగా, అందులో కేవలం 23 వేల మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు. ఈ ఏడాది లక్ష సీసీఆర్ సి కార్డుల మంజూరుకు లక్ష్యాలను నిర్దేశించారని, అందులో ఇప్పటివరకు 3,800 కార్డులు జారీ చేయడమైనదని ఆయన తెలిపారు. పాత సీసీ ఆర్సీ కార్డులను రెన్యువల్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారికి జిల్లా కలెక్టర్ సూచించారు, సిసిఆర్సి కార్డు దారులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 200 కోట్లు రుణాలు ఇవ్వాలని, బ్యాంకు బ్రాంచీల ప్రకారం లక్ష్యాలను నిర్దేశించాలని జిల్లా కలెక్టర్ ఎల్డీఎంకు సూచించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో చొరవ చూపిస్తున్నారని, ఆ ప్రకారంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి బ్యాంకులు లబ్ధిదారులకు రుణాలు





మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ఈ పథకంలో స్వయం సహాయక గ్రూపు సభ్యులను చేర్చడమైనదని ఆయన తెలిపారు. ఈ పథకం అమలుకు భారత ప్రభుత్వం 78 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి ఎస్ ఎస్‌జి సభ్యుల గృహానికి 3 యూనిట్లు స్థాపనకు నిర్దేశించడమైనదని, అందుకు గాను ప్రతి సభ్యునికి 78 వేలు సబ్సిడీ కింద వస్తుందని ఆయన తెలిపారు. దరఖాస్తుదారుడు వెండర్ను నిర్దేశించిన తర్వాత బ్యాంకులకు దరఖాస్తులు వస్తాయని, వాటికి వెంటనే లోన్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు. బ్యాంకులలో డిపాజిట్ మొత్తాలను జమ చేయుటకు డిఆర్డిఏ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడమైనదని, రుణాలను తిరిగి చెల్లించుటలో డిఆర్డిఏ శాఖ బ్యాంకులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా రుణాల కొరకు బ్యాంకులకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకుల వారీగా లక్ష్యాలను పూర్తి చేయకపోవుటకు గల కారణాలను ఆయన ఆరా తీశారు.జిల్లాలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ఒకటే ఉన్నదని, అది ప్రైవేట్ బ్యాంకు కాదని ప్రభుత్వరంగ బ్యాంక్ అని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ మహారాష్ట్ర బ్యాంక్ మేనేజర్ కు సూచించారు. జిల్లాకు 36 కిసాన్ డ్రోన్ యూనిట్ల ను లక్ష్యంగా ఇచ్చారని ఆయన తెలిపారు.ఒక్కొక్క యూనిట్ కు సుమారు 12 లక్షల ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు.అందులో 50 శాతం లబ్ధిదారుడు బ్యాంకు కు డిపాజిట్ చేయాలని, 40 శాతం బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని ఆయన తెలిపారు. ఇందుకుగాను వారికి 80 శాతం సబ్సిడీ వస్తుందని ఆయన తెలిపారు. 36 యూనిట్ల గాను 33 యూనిట్లకు బ్యాంకులో అకౌంట్లు ఏర్పాటు చేశారని, అందులో 15 అకౌంట్లకు లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తం డిపాజిట్ చెల్లించారని, మిగిలిన 18 యూనిట్లకు సంబంధించి ఇన్ ప్రిన్సిపల్ మంజూరు ఉత్తర్వులు ఇవ్వాలని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ సూచించారు. తద్వారా లబ్ధిదారుడు (తరువాయి 4లో...)

# కుప్పడం పట్టు చీరకు జాతీయ అవార్డు

## ఓడిఓపి కింద అవార్డు ప్రదానం

## ఢిల్లీలో అవార్డు అందుకోనున్న బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి

## చీరాల కుప్పడం చీరకు ప్రాచుర్యం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 13)

చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించనుంది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. జులై 14వ తేదీన న్యూఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రధానోత్సవం జరుగునుందని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. చీరాల కుప్పడం పట్టు చీరకు ప్రకటించిన జాతీయ అవార్డును బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి న్యూఢిల్లీలో అందుకోనున్నారు. సంప్రదాయ మగ్గాల పై నేతన్నలు నేసిన చీరాల కుప్పడం చీరలకు మార్కెట్ లో ఇప్పటికే కొంత డిమాండ్ ఉంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా జాతీయ అవార్డు ప్రకటించడంతో మరింత ప్రాచుర్యం పొందనుంది. దీంతో చేనేతల కష్టం ఇక ఫలించనుంది. జాతీయ మార్కెట్ లోనూ కుప్పడం చీరలు (తరువాయి 4లో...)



# యోగాంధ్ర పోటీలో పొదిలి మున్సిపాలిటీ విద్యార్థిని సత్తా అభినందించిన కమిషనర్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 13)

యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో పొదిలి మున్సిపాలిటీకి చెందిన బద్దిగం కావ్యశ్రీ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొననేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పొదిలి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి కావ్యశ్రీకి స్వీట్ తినిపించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొంది పొదిలి మున్సిపాలిటీ పేరును రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా చేయాలని ఆయన ఆకాంక్షించారు. అందుకు తగిన విధంగా సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఐటీ డైరెక్టర్ జక్కం రేణుకరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మారుతిరావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద

# భద్రత ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

## బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 13)

పాత సింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మి నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 16వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం కళ్యాణోత్సవం, రథోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అక్కడ భద్రత ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ముందుగా జిల్లా ఎస్పీ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ పరిసరాలు, ప్రవేశ మార్గాలు, క్యూలైన్లను భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం, రథం వద్ద భద్రత ఏర్పాట్లు సమీక్షించారు. దర్శనానికి విచ్చేసే భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానస్పద కదలికలు, వ్యక్తులపై నిఘా ఉంచి తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా పట్టిష్టమైన బందోబస్తు నడుమ ప్రశాంతంగా భక్తులు దర్శనం జరిగేలా చూడాలని, పార్కింగ్ , ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని, డ్రోన్, సీసీ కెమెరాల నిఘాతో ఉంచాలని, బ్రహ్మోత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, భక్తులతో మర్యాదపూర్వకంగా (తరువాయి 4లో...)



# ప్రాధాన్యత, ప్రాధాన్యత లేని రంగాలకు రుణాలు ఇవ్వాలి



డిపాజిట్ మొత్తం డిపాజిట్ చేయడానికి ఆసక్తి చూపుతారని ఆయన అన్నారు. డ్రోన్ యొక్క ఉపయోగాలు, పనితీరు పై వ్యవసాయ శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో ఒక లక్ష 60 వేల మంది రైతులు ఉన్నారన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద కౌలు రైతులను పంట బీమా చేయించాలని, బీమా వలన కలిగే ప్రయోజనాలను వివరించి వారికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పేద, బడుగు ప్రజలను అభివృద్ధిలోకి తీసుకుని వచ్చే విధంగా పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించారని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలో అట్టడుగును ఉన్న 10 శాతం అత్యంత నిరుపేదలను ఆర్టిజిఎస్ ద్వారా తెలుసుకొని, వారిని బంగారు కుటుంబాలుగా పిలుస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో 62 వేల బంగారు కుటుం బాలు ఉన్నాయని ఆయన అన్నారు. 5 వేల మంది మార్గదర్శకులకు ఈ బంగారు కుటుంబాల వివరాలను అందజేసి వారి అభివృద్ధికి దోహదం పడుతున్నామని ఆయన తెలిపారు.ఇందులో జిల్లా అధికారులను మార్గదర్శకులుగా చేర్చడమైనదని, బ్యాంకు అధికారులు కూడా ఇందులో భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నందున నిరుపేదల జీవనోపాధి పెంచడానికి రుణ సౌకర్యం కల్పించాలన్నారు. బ్యాంకు అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని ఆయన సూచించారు. నిరుపేదలకు ఎలాంటి అన్యాయం జరగకుండా రుణ పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం సూర్య ఘర్, చేనేతలకు ముద్ర రుణాలు,గేదెల బీమా కొరకు,పశుబీమా పథకం అమలుపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఉత్పత్తి రంగాల అభివృద్ధికి అధిక రుణాలు ఇవ్వాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ప్రాధాన్యత రంగాలు, ప్రాధాన్యత లేని రంగాలను కలిపి 7.51 లక్షల మందికి రుణాలు ఇచ్చి ఆయా ఉత్పత్తులు పెంచుకోవడానికి రూ. 15 వేల 820 కోట్లు రుణాలు ఇవ్వాలని వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 13 వేల 444 కోట్ల వార్షిక లక్ష్యానికి 16 వేల 603 కోట్ల రుణం మంజూరు చేసినట్లు బ్యాంకర్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, నాబార్డ్ డిడిఎం రవికుమార్, ఆర్బిఐ ఎల్డిఓ నవీన్ బాబు, యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి మాధురి, ఎల్‌డిఎం శివకృష్ణ,వివిధ బ్రాంచీల బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కుప్పడం పట్టు చీరకు జాతీయ అవార్డు



ప్రత్యేకతను సంతరించుకోనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చీరాల కుప్పడంకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. చేనేత వృత్తినే నమ్ముకుని వందలాది చేనేత కుటుంబాలు బాపట్ల జిల్లా చీరాల పేరాలలో కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నాయి. సంప్రదాయ మగ్గాలపై చేనేత కార్మికులు కష్టపడి నేసిన కుప్పడం చీరలకు ఒకప్పుడు ఎంతో డిమాండ్ ఉండేది. యంత్రాల జొరబాటుతో కుప్పడం చీరల ఉత్పత్తి సన్నగిల్లిందని కార్మికులు ఆందోళన చెందుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చేనేతల ఆశలు పునర్జీవం పోసుకున్నాయి. అలనాటి స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీజీ ఇచ్చిన పిలుపు అందుకున్న చీరాల పేరాల చేనేత కార్మికులు విదేశీ వస్త్రాలను వ్యతిరేకించడంలో ప్రధానపాత్ర పోషించారు. నేత వస్త్రాల ఉత్పత్తులకు చీరాల క్షీరపురిగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏడాది జనవరి 9వ తేదీన కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా క్షేత్రస్థాయి పరిశీలన పై బాపట్ల, చీరాలలో పర్యటించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కుప్పడం చీరల ప్రదర్శనను కేంద్ర బృందం సభ్యులు, జిల్లా కలెక్టర్ కలిసి పరిశీలించారు. ఆ సమయంలోనే చీరాలలో చేనేత వస్త్రాలైన కుప్పడం చీరల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై కేంద్ర బృందానికి కలెక్టర్ నివేదిక అందజేశారు. పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం చీరాల కుప్పడం చీరలకు ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద గుర్తింపునిస్తూ జాతీయస్థాయి అవార్డును ప్రకటించింది. జాతీయస్థాయి అవార్డును జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి జులై 14వ తేదీన అవార్డును అందుకోనున్నారు.



# శ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

వ్యవహరించాలని, రథోత్సవం జరిగే సమయంలో ఎలాంటి తోపులాట్లు, అవాంత రాలు జరగకుండా రథోత్సవం విజయవంతంగా ముగిసేలా సమన్వయం, సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. ఈ బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టాలైన కళ్యాణోత్సవం, రథోత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన సిబ్బందితో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట సింగరాయకొండ, సిఐ హాజరత్తయ్య, ఒంగోలు ట్రాఫిక్ సిఐ పాండురంగారావు, సింగరాయకొండ ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది ఉన్నారు.





# మద్యాన్ని మతంతో పోల్చిన బాలీవుడ్ లెజెండరీ గీత రచయిత జావేద్ అక్తర్

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,జూన్ 13)**



ప్రముఖ రచయిత, కవి జావేద్ అక్తర్ ఇటీవల మతం, మద్యంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ రెండింటి మధ్య పోలిక తెస్తూ, రెండూ మితంగా ఉన్నంతవరకే ప్రయోజనకరమని, అతిగా మారితే మాత్రం హానికరం అని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో తాను మద్యపాన వ్యసనానికి గురై, దాని నుంచి బయటపడ్డానని అంగీకరించిన జావేద్ అక్తర్, ప్రస్తుతం చాలా సంవత్సరాలుగా మద్యానికి దూరంగా ఉంటున్నారు.ఇటీవల ఆజ్ తక్ రేడియోతో జరిగిన ఒక సంభాషణలో, మద్యం మంచిదా చెడ్డదా అనే ప్రశ్నకు జావేద్ అక్తర్ సమాధానమిస్తూ, "ఏదైనా సరే అతిగా తీసుకుంటే చెడ్డదే. కొద్దిగా తీసుకుంటే ఫర్వాలేదు, కానీ సమస్యల్లా ప్రజలు ఆ కొద్ది మోతాదుతో ఆగకపోవడమే" అని అన్నారు. "పాలు రెండు గ్లాసులు తాగితే ఆపేస్తారు, కానీ మద్యం రెండు గ్లాసులతో ఆపలేరు" అని ఆయన తెలిపారు.మద్యం, మతం రెండింటిలోనూ చాలా సారూప్యతలు ఉన్నాయని జావేద్ అక్తర్ పేర్కొన్నారు. "అమెరికన్లు ఒకప్పుడు ఒక సర్వే చేశారు. అసలు తాగని వారు, రోజూ ఒక బాటిల్ మొత్తం తాగేవారు.. వీరిలో ఎవరు ఎక్కువ కాలం జీవిస్తారని ఆ సర్వేలో తేలింది. ఇద్దరూ ఎక్కువ కాలం జీవించరని కనుగొన్నారు. రాత్రి భోజనానికి ముందు కచ్చితంగా రెండు పెగ్గులు తీసుకునేవారే ఎక్కువ కాలం జీవిస్తారని తెలిసింది. ఔషధాల్లో కూడా ఆల్కహాల్ ఉంటుంది, మరి అదెలా చెడ్డది అవుతుంది? అతిగా సేవించడమే చెడ్డది" అని ఆయన వివరించారు.

# వైకాపాకు జై కొడితే.. పెద్దపీట వేస్తాం రండి

**ఏరికోరి మరీ తెచ్చుకుంటున్న అధికారులు**
**సెర్ప్‌లో పోస్టింగుల్లో గతంలోనూ ఇదే తీరు**
**సిఫార్సు లేఖలు ఇస్తున్నది తెదేపా ఎమ్మెల్యేలే**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 13)**

డ్వాక్రా మహిళల స్వయం ఉపాధి కల్పనలో కీలకమైన గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్)ని అధికారులు వైకాపా మనుషులతో నింపుతున్నారు. ఆ పార్టీకి జై కొట్టే వారిని ఏరికోరి మరీ రాష్ట్ర కార్యాలయానికి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే కీలకమైన విభాగాలకు సంబంధించిన డైరెక్టర్ పోస్టుల్లో సగం వరకు వైకాపా ప్రభుత్వంలో నియమించిన వారే కొనసాగుతున్నారు. అప్పట్లో ఆ పార్టీ నేతల సిఫార్సులతో పోస్టులు దక్కించుకున్న వీరు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా తెదేపా ఎమ్మెల్యేల లేఖలతో అవే స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇప్పుడు వీరి కింద ఉండే పోస్టుల్లోనూ వైకాపా సానుభూతిపరులను నియమించుకుంటుండటం గమనార్హం. వీరికి ఎంచక్కా తెదేపా ఎమ్మెల్యేలే సిఫార్సులు లేఖలు ఇస్తుండటం కొసమెరుపు.

**ఎన్నికల్లో వైకాపా తరపున డబ్బులు పంచి..** అధికారంలో ఉన్నది ఏ ప్రభుత్వమైనా.. ఆ ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా పనిచేయడం ఉద్యోగుల ధర్మం. ఇక్కడ పార్టీలతో పనిలేదు. కానీ వైకాపా ప్రభుత్వంలో కొంతమంది అధికారులు, సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరించారు. ఉద్యోగులమనే ధ్యాసే లేకుండా అచ్చంగా ఆ పార్టీ కార్యకర్తల్లాగా పనిచేశారు. ఎంతగా అంటే, కొందరు గత ఎన్నికల్లో ఏకంగా వైకాపా తరపున డబ్బులు కూడా పంచిపెట్టారు. ఆ పార్టీకే ఓటేయాలని క్షేత్రస్థాయిలో వీవోఏలపై ఒత్తిడీ తెచ్చారు.


అలాంటి ఇద్దరు అధికారులను ఇప్పుడు బదిలీల్లో ఏకంగా రాష్ట్ర కార్యాలయానికి తెచ్చుకుంటుండటం శాఖలో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరికీ కూడా సెర్ప్‌లో ప్రాధాన్యమున్న విభాగంలోనే పోస్టింగ్ ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. వైకాపాకు వంతపాడే మరో అధికారిణికి సెర్ప్ హెడ్ ఆఫీస్‌కు బదిలీపై వచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వీరికి బాగా పనిచేస్తారనే ట్యాగ్ ఇచ్చి మరీ తెచ్చుకుంటున్నారు.

**ఓటేసేది వైకాపాకే అని వంతపాడుతున్నా..**

సెర్ప్ పరిధిలోని స్త్రీనిధిలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. మాజీమంత్రి అంజాద్ బాషాకు వంతపాడే అధికారిని ఇటీవల బదిలీలో స్త్రీనిధికి తెచ్చుకున్నారు. ఆయన తాను ఓటేసేది వైకాపాకేనని బహిరంగంగానే చెబుతున్నట్లు శాఖలో చర్చ నడుస్తోంది. ఆయన బదిలీ విమర్శలకు తావివ్వడంతో తెదేపా నేతల నుంచి సిఫార్సు లేఖ తెచ్చుకోవాలని అధికారులే ఉచిత సలహా ఇచ్చారు. ఆ మేరకు ఆ అధికారి వైస్సార్ కడప జిల్లాకు చెందిన తెదేపా ఎమ్మెల్యే ఒకరి నుంచి సిఫార్సు లేఖ తెచ్చుకుని అక్కడే కొనసాగుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మరో ఇద్దరు అధికారులూ వైకాపాకు కోవర్టులుగా పనిచేస్తున్నట్లు సమాచారం.

**గతంలోనూ ఇదే వైఖరితో దెబ్బ..**

2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలోనూ సెర్ప్‌లో ఇదే తీరు కొనసాగింది. అప్పట్లో ఒక కీలక విభాగానికి డైరెక్టర్‌గా పనిచేసిన అధికారి.. ప్రతిపక్షంగా ఉన్న వైకాపాకు సెర్ప్ కార్యకలాపాలను రోజూ నివేదించే వారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతగానీ ఆ విషయం బయటపడలేదు. దీనికి ప్రతిఫలంగా ఆ అధికారికి వైకాపా ప్రభుత్వంలో ఏకంగా సీఎంవోలోనే పోస్టింగ్ దక్కింది. అంతేకాదు.. కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి దొరికింది.



# రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలి

**రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం**

**రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి**

**పొగాకును వెంటనే కొనుగోలు చేయాలి**

**మిర్చి పంటకు గిట్టుబాటు ధర రూ.15 వేలు ఇవ్వాలి**

**సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్**





**(షణ్ముఖ వెలుగు, నూజెండ్ల, జూన్ 13)**

రాజ్యాంగాన్నిరక్షించుకొనుటకు ప్రజాస్వామ్యాన్నికాపాడుకొనుటకు పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది మొదలుకొని నేటి వరకు 12 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నాడు ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీ గారు దేశ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఒకటి కూడా అమలు చేయలేదని వంద రోజులలో ధరలు తగ్గిస్తామన్నారని ఈ 12 సంవత్సరాల్లో సామాన్యులు కొనుగోలు చేసే సరుకులు వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి సామాన్య ప్రజల జీవనం పెను భారమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను నమ్మించి తిరుమల వెంకన్న సాక్షిగా మన రాష్ట్రానికి ప్రత్యేక హొదా 10 సంవత్సరాలు ఇస్తామని నమ్మించి మోసం చేసిన మోడీ పెట్టుబడిదారీ అనుకూల దేశంలోని ప్రభుత్వ సంపద మొత్తాన్ని అంబానీ ఆ దాని లాంటి వాళ్ళకి ధారాధత్వం చేస్తున్నందున ఇలాంటి ప్రజా వ్యతిరేక విధాన్నా అవలంబించినందున దేశంలో సామాన్యులు వాడుకునే నిత్యావసర సరుకుల, వస్తువుల ధరలు పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ విపరీతంగా పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయని, "ఏమీ కొనేటట్టు లేదు ఏమీ తినేటట్టు లేదు" అన్న చందంగా ప్రజలు విలవిలలాడిపోతున్నారని తీవ్రంగా విమర్శించారు. దేశ సంపదలైన జీవిత బీమా, ఇన్సూరెన్స్ రంగాన్ని, బొగ్గు గనులను, ప్రభుత్వ బ్యాంకులను, పరిశ్రమలను మన రాష్ట్రంలో విశాఖ ఉక్కు పరిశ్రమ కూడా ఇప్పుడు మరలా ప్రైవేట్ పరం చేయాలని చూస్తోందని విశాఖ ఉక్కు పై ప్రైవేట్ పరం కాకుండా అచటి కార్మికులు ప్రజలు సుదీర్ఘ పోరాటం కొనసాగిస్తున్నారని అన్నారు. అనంతరం వినుకొండ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలపై ఆయా రాష్ట్రాలలో కేంద్రం ఆధీనంలో ఉన్న సిబిఐ, ఈడి లను ఉపయోగించి కుట్ర కేసులు బనాయించి ప్రతిపక్ష పార్టీలను ఆయా ప్రభుత్వాలలోని మంత్రులను ముఖ్య మంత్రులను భయకంపితులను చేయుచు అక్రమ కేసులతో తన పార్టీలోకి చేర్చుకొనుటకు బిజెపి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎంతటి తప్పు చేసిన ఎంతటి అవినీతి చేసిన తర్వాత జిల్లావారైనా భారతీయ జనతా పార్టీలో చేరితే ఆ తప్పులను కొట్టివేసి నీతిమంతులు అయిపోయే పరిస్థితులు వస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. దేశంలో రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాలరాసి తనకబంధహస్తాలలో బంధించి అన్ని రాష్ట్రాలలో కూడా పాగా వేయుటకు ప్రతిపక్ష రాజకీయ నాయకులను ఎమ్మెల్యేలను ఎంపీలను డబ్బు ఎరచూపి, కుట్ర కేసుల తో భయకంపితులను చేయుచు యదేచ్ఛగా నిరంకుశత్వ విధానాలు ప్రయోగిస్తున్నారు కావున రాష్ట్రంలోనూ దేశంలోనూ వివిధ ప్రాంతాల్లో నేటికీ మైనారిటీ మతస్తుల పై వారి ఆస్తులు దేవాలయాల పై జరుగుతున్న మత దురహంకార విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవల్లపూడి రాము మాట్లాడుతూ రైతన్నలకు నల్ల చట్టాలు రద్దుచేసి పండించిన పంటలకు గిట్టుబాటు ధరపై చట్టం చేస్తానని వ్రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పెరిగిన అధిక ధరలను తగ్గించాలని దేశంలో మత సామరస్యాన్ని కాపాడాలని మైనారిటీ మతస్తులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల లోనూ గ్రామీణ ప్రాంతాలలోనూ విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాయబారం వందనం కొప్పరపు మల్లికార్జున రావు, రాయబారం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**అధికారులు బాధ్యతగా, జవాబుదారీతనంతో ఉండాలి**

**వినుకొండలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

**ప్రజా దర్బార్‌కి విశేష స్పందన**



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 13)**

ప్రజా సమస్యల పట్ల అధికారులు ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, ప్రతి ఒక్కరు కూడా బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారంలో వినుకొండ నియోజకవర్గాన్ని, పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాల్సిన అవసరం ఉందన్నారాయన. ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మట్లాడారు చీఫ్ విప్ జీవీ. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం



ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాధనంతో జీతాలు తీసుకునే ప్రతిఒక్కరు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వినతుల్లో వచ్చే ప్రతిసమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజలంతా ఏ నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని భారీ ఆధిక్యంతో అధికారంలోకి తెచ్చారో దానిని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమవద్దకు వచ్చే అర్జీలను స్కాన్ చేసి అధికారికులకు కూడా పంపిస్తున్నామని తద్వారా రికార్డులు పక్కాగా ఉండి యంత్రాంగంలో కూడా జవాబుదారీతనం వస్తుందని ఆశిస్తు న్నామన్నారు. ప్రజాదర్బార్ నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తామందరికీ ఆదర్శంగా పేర్కొన్నారు. పంచాయతీ సర్పంచ్‌లు, వీఆర్వోలు, మండలస్థాయి అధికారులు కూడా ఇకపై ప్రజాసమస్యల పరిష్కారంలో భాగం కావాలని సూచించారు. ఇలా ప్రజల అర్జీల ద్వారా ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయినందుకు సంతోషంగా ఉందన్నారు.

# బాలా త్రిపుర సుందరిదేవి ఆలయ నూతన కార్యనిర్వాహణాధికారిగా అనిల్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 13)**

మండలంలోని శ్రీ త్రిపురాంతకేశ్వర, బాలా త్రిపుర సుందరిదేవి ఆలయ నూతన కార్యనిర్వాహణాధికారిగా శుక్రవారం అనిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నిత్యం ధూపదీప నైవేద్యం ఆలయానికి వచ్చే భక్తులు, ప్రముఖులకు అందిస్తామన్నారు.

# వివాహిత పై అత్యాచారయత్నం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 13)**

నిద్రిస్తున్న వివాహితపై అత్యాచారయత్నానికి ప్రయత్నించగా సదరు వివాహిత పెద్దగా కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. ఈ సంఘటన ఈ నెల 11న బుధవారం పొన్నలూరు అంబేద్కర్ నగర్‌లో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు మేరకు స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన సదరు యువతికి కొన్నేళ్ల క్రితం చీరాల ప్రాంతానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. అయితే ఇద్దరు మధ్య మనస్పర్ధలు రావడంతో సదర వివాహిత దూరంగా ఉంటూ తన ఐదేళ్ల కుమార్తెతో కలిసి కొన్నేళ్లగా తల్లిదండ్రుల వద్ద పొన్నలూరులో ఉంటుంది. ఈ క్రమంలో చిన్న, చిన్న పనులు చేసుకుంటూ తల్లిదండ్రుల వద్ద జీవనం కొనసాగిస్తుంది. అయితే ఈ నెల 11న బుధవారం సదరు వివాహిత తన ఇంట్లో నిద్రిస్తుండగా అదే కాలనీకి చెందిన లేళ్లపల్లి ప్రసాద్ అతని బంధువు చందు ఇద్దరు కలిసి తెల్లవారుజామున 3 గంటల సమయంలో సదరు వివాహిత ఇంటి దగ్గరకు వచ్చారు.

ఆమె నిద్రిస్తున్నట్లు గుర్తించి అరవకుండా ముందుగా గట్టిగా నోరు మూసి పట్టుకున్నారు. అనంతరం ఆమెను పట్టుకొని అత్యాచారయత్నానికి ప్రయత్నించి శరీరంపై అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో కొంతసేపు పెనుగులాడిన తర్వాత వారి నుంచి తప్పించుకున్న వివాహిత పెద్దగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు రావడానికి గమనించిన ప్రసాద్, చందు అక్కడ నుంచి పరారయ్యారు. అయితే ప్రసాద్‌కు వివాహమై కొన్ని రోజులుగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. అలాగే గ్రామంలో ఉపాధి హామీ మేట్‌గా ఉంటూ పనులు చేయిస్తున్నాడు. ఈ సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనూక్ తెలిపారు.

# నూజెండ్ల ఏవోగా ఆంజనేయులు నాయక్

**(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జూన్ 13)**



సాధారణ బదిలీలులో భాగంగా నూజెండ్ల మండల వ్యవసాయ అధికారిగా నెల్లూరు జిల్లా ఉదయగిరి నుండి ఏ ఆంజనేయులు నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన షేక్ సుగుణా బేగం ప్రత్తిపాడు మండలానికి బదిలీ అయ్యారు. అదే విధంగా వినుకొండ మండలం నుండి ములకలూరు గ్రామానికి వ్యవసాయ విస్తరణ అధికారిణిగా పి వి కృష్ణవేణి భాద్యతలు స్వీకరించారు. నూజెండ్ల గ్రామం నుండి కొండ్రముట్ల గ్రామానికి ఏఈవోగా మల్లికార్జునరావు బదిలీపై వెళ్లారు. ఏవో ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఏవోకు కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

# దొంగబాబాను అరెస్ట్ చేసిన కరీంనగర్ పోలీసులు

**నిందితులను అరెస్టు చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు**

**(షణ్ముఖ వెలుగు, కరీంనగర్ , జూన్ 13)**



ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దొంగ బాబాలు మోసాలకు పాల్పడుతూ దోచుకుంటున్నారు. గుప్త నిధుల పేరుతో అనేక ప్రాంతాల్లో మోసాలు జరుగుతున్నాయి. తాజాగా, ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న దొంగ బాబాల ముఠా సభ్యులను కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు.కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన గజ్జి ప్రవీణ్ తన కుటుంబంలో ఆర్థిక, అనారోగ్య సమస్యలు ఉన్నాయని దొంగ బాబాను ఆశ్రయించాడు. దీంతో దొంగ బాబా ముఠా సభ్యులు మీ ఇంటి పక్కనే క్వింటాల్ వరకు బంగారం ఉందని, దానికి పూజలు చేసి బయటకు తీస్తే మీ కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగుపడుతుందని, లేకపోతే మీ ఇంట్లో వారు చనిపోతారని బాధితుడు గజ్జి ప్రవీణ్ను బెదిరించారు.గుప్త నిధి వెలికితీసే పూజల కోసం అంటూ విడతల వారీగా దొంగ బాబా గ్యాంగ్ సభ్యులు బాధితుడి నుంచి రూ.15.30 లక్షలు వసూలు చేశారు. డబ్బులు తీసుకున్న తర్వాత నిందితులు కొంత పూజ సామాగ్రి కొనుగోలు చేసి ఇంటి పక్కనే ఒక గొయ్యి తవ్వి కుంకుమ చల్లి అందులో నుంచి ముందుగా ఏర్పాటు చేసుకున్న ఒక డబ్బా బయటకు తీసి ఇందులో బంగారం ఉందని బాధితుడు గజ్జి ప్రవీణ్కు నమ్మబలికి, ఇంకా డబ్బులు కావాలని వేధించారు.దీంతో బాధితుడు కొత్తపల్లి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గుప్త నిధుల పేరుతో మోసం చేసిన ఈన్నాల రాజు, మిర్యాల దుర్గయ్య, పెనుగొండ రాజు, చల్ల అజయ్, ఈర్నాల సతీశ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.15.30 లక్షల నగదుతో పాటు ఏడు తులాల బంగారం, మూడు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ తెలిపారు.

# బాలకార్మికుడుని పనిలో పెట్టుకోవడం పై కేసు నమోదు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 13)

ఫిర్యాది (బాల కార్మికుడు) 16 సంవత్సరాల వయస్సు కలిగిన నెమల తేజ తాతారావు ఈదటం గ్రామం, పయకరంపల్లి మండలం మండలం, అనకాపల్లి జిల్లా. ఫిర్యాది పదో తరగతి చదువుతున్నట్లు ఫిర్యాది స్నేహితుడైన నాగేష్ ఉలవపాడు మండలంలోని అలగాయపాలెం గ్రామంలోని శ్రీనివాస హేచరీ నందు పనిచేస్తున్నట్లు, ఫిర్యాదికి వేసవి సెలవులు కావడంతో తన స్నేహితుడైన నాగేష్ ద్వారా గత నెల 3వ తేదీన సదరు శ్రీనివాస హేచరి నందు చేరి రొయ్య పిల్లలు పెంచే ట్యాంకులు క్లీన్ చేసే పని చేస్తున్నట్లు తెలిపాడు. గత నెల 27వ తేదీన ఉదయం 10.50 గంటల సమయంలో ఫిర్యాది తన స్నేహితులైన నాగేష్, బాబు, సర్దార్ అనువారులతో కలిసి రొయ్య పిల్లలు పెంచే ట్యాంకు క్లీన్ చేయుటకు నిచ్చెన వేసుకుని యాసిడ్ బకెట్‌తో నిచ్చెన మీద దిగుతూ ఉండగా ఫిర్యాది కాలుజారి నిచ్చెన పై నుంచి కిందపడి తలకు బలమైన వాపుడు గాయమైనట్లు, బకెట్‌లో ఉన్న యాసిడ్ కళ్ళలో పడి కళ్ళు బాగా మంటలుగా ఉన్నట్లు, అంతట హేచరీ సిబ్బంది సదరు ఫిర్యాదుని మొదటిగా పటవారిపాలెం ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో చూయించినట్లు, తర్వాత ఫిర్యాదుని తన స్వగ్రామానికి తీసుకుని వెళ్లినట్లు, ఫిర్యాది తల్లిదండ్రులు ఫిర్యాదిని తుని ఆసుపత్రిలో చూయించి, తలకు స్కానింగ్ చేయించగా అక్కడి డాక్టర్లు ఆపరేషన్ చేయాలని చెప్పారన్నారు. ఫిర్యాది అక్కడ చికిత్స నిమిత్తం చేరగా అక్కడ డాక్టర్ ఫిర్యాదుకి వైద్యం చేసినట్లు, అక్కడినుండి వచ్చిన సమాచారం మేరకు ఉలవపాడు పోలీసు వారు 18 సంవత్సరాల లోపు బాల కార్మికులను ప్రమాదకరమైన పనులలో పెట్టుకుని సదరు బాల కార్మికుడు అయిన తేజ తాతారావుకు గాయాలు కలుగజేసిన సదరు శ్రీనివాస హేచరీ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.

కేసు దర్యాప్తులో భాగంగా ఉలవపాడు పోలీసులు, లేబర్ ఇన్స్‌పెక్టర్ సుజాత శ్రీనివాస హేచరీ వద్దకు వెళ్లి అక్కడ ఇంకా ఎవరైనా బాల కార్మికులు ఉన్నారేమోనని విచారించి, కేసు దర్యాప్తు చేసినట్లు ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ తెలిపారు.



## మండల వ్యవసాయశాఖ అధికారిగా వి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 13)

మండలంలోని వ్యవసాయధి కారిగా విధులు నిర్వహిస్తున్న కేవీ రమణ ప్రస్తుతం బదిలీలో వ్యవసాయధికారి. భూసార పరీక్ష కేంద్రం ఒంగోలునకు బదిలీ అయ్యారు. హనుమంతుని పాడు మండలంనకు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం నందు పనిచేస్తున్న మండల వ్యవసాయధికారి వి రవికుమార్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమాలకు అర్హులైన ప్రభుత్వం వారు లాగిన్ నందు పంపిన లిస్టులోని వారు ఈ కేవైసీ చేపించుకోవాలని, స్థానిక రైతు సేవ కేంద్రం నందు వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు ద్వారా అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## గుండెపోటుతో పాత్రికేయుడు మాల్యాద్రి మృతి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 13)

గత ఏడేళ్ల నుంచి ఓ పత్రికలో పనిచేస్తున్న పల్లపోతు మాల్యాద్రి గుండెపోటుతో గురువారం రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందాడు. స్థానికంగా నివాసముంటున్న మాల్యాద్రిని సమీప వైద్యశాలకి తరలించే లోపే గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని పెద్దలు, గ్రామస్థులు, మీడియా ప్రతినిధులు ఆయన నివాసం వద్దకు వెళ్ళి నివాళులర్పించారు.



# ఉపాధి బిల్లులు చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళన



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 13)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో గత మూడు నెలలుగా పని చేస్తున్న కూలీలకు తక్షణమే బిల్లులు చెల్లించాలని బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడం వలన ఉపాధి కూలీలు ఈ ప్రభుత్వం బిల్లులు చెల్లించటం లేదు పనికి పోవడం దండగనే అభిప్రాయం ఏర్పడిందని, ఇది ఉపాధి చట్టం అమలకు ప్రభుత్వ వైఖరి కూడా మంచిది కాదన్నారు అనేక గ్రామాలలో 9 వారాలు పనులు చేసి చేసిన పనికి డబ్బులు రాక కూలీలు పనికిరావటం తగ్గిపోతుందన్నారు ఇది ఉపాధి చట్టాన్ని నెరవేరేం చేసేందుకు పాలకులు వేస్తున్న పన్నాగం గా వీరు వర్ణించారు ప్రభుత్వానికి కూలీల పట్ల పేదల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు నెలలు తరబడి ప్రభుత్వ పథకంలో పని చేస్తున్నటువంటి కూలీలు డబ్బులు చెల్లించుకుంటే ఏం తిని పనిచేయాలి ఎలా బ్రతకాలని ప్రశ్నించారు చిల్లర దుకాణాలలో నెలలు తరబడి అప్పులు ఇచ్చే పరిస్థితి కూడా లేదని అప్పు కూడా దొరకని పరిస్థితి కూలీలకు ఈ ప్రభుత్వాలు తీసుకువచ్చాయన్నారు పార్లమెంట్ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు తమ వేతనాలు నెలనెలా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తమ జీతభత్యాల నాటుకొని కూలీలకు బిల్లులు చెల్లించటానికి చొరవ చేయాలన్నారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని ప్రశ్నించారు. జీఎస్టీ పేరుతో ప్రజల నుండి వివిధ రకాల పన్నులు వేల కోట్ల రూపాయలు వసూలు చేసుకుంటూ కార్పొరేట్ సంస్థలకు పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వడంకు పేదలు పొట్ట కొట్టడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే గ్రామ గ్రామాన ఉన్న ఉపాధి కూలీలందర్నీ సమీకరించి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలపాటి బలరాంరెడ్డి, జి శ్రీను, ఎం రమణారెడ్డి, ఎం డేవిడ్, ఎం రామిరెడ్డి, వి జయరావు, జనుమాల పుల్లయ్య, గాల మంజమ్మ, బి సుభాషిని, వై నాగూర్, శ్యామల, శ్రీనివాసులుతో పాటు ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం పై ప్రజల్లో అసంతృప్తి

# సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలం

### సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 13)

కూటమి ప్రభుత్వం పట్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి వ్యాఖ్యానించారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో కూటమి ఏడాది పాలన పై ప్రచురించిన బుక్ లెట్‌ను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి, సయ్యద్ హనీఫ్, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు లతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా సపరిపాలన అందించినట్లు చెప్పుకుంటుందని, ప్రజలు అటువంటి సంతృప్తి వ్యక్తం చేయడంలేదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం పై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. 56 శాతం ఓట్లతో అత్యధిక స్థానాలు దక్కించుకున్న టిడిపి మంచి సుపరిపాలన అందిస్తుందని ప్రజలు ఎదురు చూసారని తెలిపారు. కేంద్రంలో 400 సీట్లు ఆశించిన బిజెపి టిడిపి సీట్ల పై ఆధారపడి పరిపాలన చేయవలసిన పరిస్థితి లోకి నెట్టబడిందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్రానికి కావలసిన వనరులు రాబట్టుకోవడం, విభజన హామీలు అమలుకు కేంద్రం పై వత్తిడి తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు భావించారు. ఆచరణలో ఆ ప్రయత్నం జరగలేదన్నారు. సూపర్ సిక్స్ వంటి పథకాలు ఇంటింటికి అమలుచేస్తామని హామీ ఇచ్చి టిడిపి భారీ మెజారిటీ సాధించిందని, గత ప్రభుత్వం కంటే అధిక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ప్రజలు విశ్వాసం పెంచుకున్నట్లు తెలిపారు. అయితే ఆచరణలో ఆ ప్రయత్నం చేయకపోవడం వల్ల ప్రజల విశ్వాసాన్ని పొందలేక పోయినట్లు పేర్కొన్నారు. కూటమి రాష్ట్ర ప్రజలు విశ్వాస్వాన్ని దెబ్బ తీసిందన్నారు. రైతు భరోసా ఇస్తామన్న హామీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. 60 శాతం పైగా ప్రజలు ఆధార పడిన వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి సంపదను ఎలా సృష్టిస్తారని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు కల్తీ విత్తనాల కంపెనీల చేతుల్లో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విత్తనాలు, పురుగు మందులు సబ్సిడీకి అందించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. పొగాకు కొనుగోలు జరగక రైతుకు గిట్టుబాటు ధర లభించక ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బర్లీ పొగాకుకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ విధానాన్ని ప్రభుత్వం దెబ్బతీసినట్లు విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఆడబిడ్డ పథకం 18 ఏళ్ల పై బడి 50 ఏళ్ల లోపు వయోజన మహిళలకు ఆర్థిక సహాయం రూ.1500 ఇస్తామని అమలు చేయలేదని, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు గృహిణులకు ఆర్థిక స్వావలంబన అందించినట్లు కూటమి ప్రభుత్వం అందజేస్తుందని నమ్మారన్నారు. కాగా చంద్రబాబు పి 4 పేరుతో ఎవరికైతే ఈ పథకం అవసరమో అటువంటి వారికి అమలు చేస్తామని మాటమార్చటం మాట తప్పడం కాదా అని ప్రశ్నించారు. 2014లో ఇదే ప్రభుత్వం డ్వాక్రా రుణాలు రద్దు హామీ నెరవేర్చక పోవడంతో డ్వాక్రా మహిళల ఆగ్రహానికి గురైన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటికీ వయోజన మహిళలు ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నారని, పి 4 పేరుతో కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే దయా దాక్షిణ్యాలపై ఆధారపడేలా చేసే ప్రక్రియను చేపట్టడం మహిళలను మరోసారి మోసగించడమేనని ఆరోపించారు. లక్షలాది ఉద్యోగాలు అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం లక్షల మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ఆరోపించారు. ఇదిలా ఉండగా రాష్ట్రం లో మహిళకు రక్షణ లేకుండా పోతుందన్నారు. దీనికి కారకులు ఎవరు అనేది గుర్తించాలని, రాజకీయపార్టీల్లోని అనైతికత, మద్యపానమా, అశ్లీల మాధ్యమాల ప్రచారమా, ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా వీటన్నింటి పై దృష్టి సారించి మహిళకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మాబు తదితరులు మాట్లాడారు.

---

## కూటమి ప్రభుత్వంతోనే

# సంక్షేమం సాధ్యం

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 13)





ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ "తల్లికి వందనం పథకం" రూ.15,000 చొప్పున వారి వారి ఖాతాల్లో జమ చేయడంతో శుక్రవారం అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రపటాలకు విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక నేతలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం' అమలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకోవడం జరిగింది. గత ప్రభుత్వం కేవలం 42,61,965 మంది విద్యార్థులకు అమ్మఒడి ఇచ్చింది. కూటమి ప్రభుత్వం 67,27,164 మంది విద్యార్థులకు ఇస్తోంది. అంటే గత ప్రభుత్వం కంటే 24,65,199 మందికి అదనంగా వర్తింపచేసి చంద్రబాబు నాయుడు సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్ళులా సుపరిపాలనలో మొదటి అడుగు నాంది పలికారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మోషే, మాథ్యూస్,రవి, బడావలి, ఆదినారాయణ,ప్రసాద్,తిమోతి, చినబాబు, అనీల్, మహేష్, శ్రీను, మంగయ్య, ఉస్మాన్, కాలేషా, రామారావు,ఉదయ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## మంద కృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసిన అశోక్ మాదిగ

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జూన్ 13)



దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు పొందిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగని హైదరాబాద్లోని ఆయన నివాసంలో శుక్రవారం ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేదురి ఆశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆశయాలను నూతన తరానికి తీసుకెళ్లే బాధ్యత మా వంటి యువత మీద ఉంది. మేము ఆయన మార్గదర్శకత్వంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లుతామని తెలిపారు. సమానత్వం, న్యాయం, గుర్తింపు కోసం సాగుతున్న ఉద్యమాన్ని మరింత ముమ్మరం చేయాలన్నది తన ఆకాంక్ష అన్నారు.

## దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి నోటీసులు

### పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టి వెంకటేశ్వర్లు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 13)


పొదిలి పట్టణంలో 11వ తేదీ జరిగిన సంఘటనలకు సంబంధించి దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టి వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదిలి పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లకు సంబంధించి ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ, శాంతిభద్రతలకు భంగం కలిగించినట్లు పోలీసులు గుర్తించడం జరిగిందన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొదిలి లోని ఎస్వికెపి డిగ్రీ కాలేజ్ వద్ద హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి, 200 మీటర్ల స్టైరైల్ జోన్ ఏర్పాటు, ఒకే వీఐపీ కాన్వాయ్, ఒక బస్సు మాత్రమే అనుమతి వంటి సూచనలను ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి స్పష్టంగా తెలియజేయడం జరిగిందన్నారు. పార్టీ కార్యకర్తలు పోలీసుల మార్గదర్శకాలు పాటించాలని కూడా సూచించబడిందన్నారు. అయితే పర్యటన రోజున పార్టీ కార్యకర్తలు స్టైరైల్ జోన్‌లోకి బలవంతంగా ప్రవేశించి బారికేడ్లను తొలగించారన్నారు. అనేక వ్యక్తిగత వాహనాలు అనుమతి లేకుండానే హెలిపాడ్ వరకు వచ్చాయన్నారు. పట్టణంలో శాంతియుతంగా ఉన్న ఇతర పార్టీల కార్యకర్తల పై దాడికి యత్నించి, చెప్పులు, రాళ్లు విసిరారన్నారు. పోలీసులను గాయపరచడం, విధులకు ఆటంకం కలిగించడం, వీఐపీ కాన్వాయ్ దారిని మూసివేయడం వంటి చర్యలు జరిగాయన్నారు. పొగాకు బోర్డులోకి బలవంతంగా ప్రవేశించి, బేళ్ళను తొక్కి ఆస్తి నష్టం కలిగించారని, ఇలా పలు సంఘటనలు చోటు చేసుకున్నాయని పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల సూచనలు తెలిసినప్పటికీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించి, చట్టాన్ని అతిక్రమించిన కార్యకలాపాలను అడ్డుకోలేకపోయారని నోటీసులో పేర్కొన్నామన్నారు. ఈ సంఘటనలకు బాధ్యత వహించాల్సిన స్థాయిలో ఉన్నందున, ఆయన పై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో కోరడం జరిగిందన్నారు. తక్షణమే వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టం చేశామన్నారు.

## ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రభుత్వ తోడ్పాటు

### కాలేయ మార్పిడి చికిత్సకు రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

### ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 13)



ప్రజల ఆరోగ్యం, వారి సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గడిచిన ఏడాదిగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచీ ప్రతి పేదవాడికీ అండగా నిలిచేలా సీఎం సహాయ నిధి సేవలను అందుబాటులోకి తీసుకుని వచ్చా మన్నారు. వినుకొండ నియోజక వర్గానికి సంబంధించి... కాలేయ మార్పిడి చికిత్స చేయించుకున్న వడ్లమూడి హరికృష్ణ అనే వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.10 లక్షల చెక్కును శుక్రవారం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అందజేశారు. వినుకొండ వెల్లటూరు రోడ్డులోని శర్మ పాఠశాల ప్రాంతానికి చెందిన హరికృష్ణ ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాలేయ మార్పిడి చికిత్స తీసుకున్నారు. అనంతరం చికిత్స కోసం అయిన ఖర్చు వివరాలతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు వచ్చిన సహాయ మొత్తాన్ని చీఫ్‌విప్ జీవీ హరికృష్ణకు అందిం చారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ హరికృ ష్ణ కుటుంబం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఏడాదిలోనే 50 వేల మందికి పైగా రూ.350 కోట్లు సాయం అందించి ముఖ్యమంత్రి సహాయనిధికి చంద్రబాబు నిజమైన అర్థం చెబుతున్నారన్నారు. పేదధనిక అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరికి వైద్యం అందాలనే సంకల్పంతో ఈ సహాయ నిధిని సమర్థవంతంగా వినియోగిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏవోగా డి విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 13)

మండల కేంద్రమైన ఉలవపాడు మండల వ్యవసాయ అధికారిగా డి.విజయ్ కుమార్ శుక్రవారం రోజున బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా కొండపి మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపడుతూ సాధారణ బదిలీపై ఉలవపాడు మండలం కు రావడం జరిగింది అని తెలియజేశారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ శాఖ నందు అన్నదాత సుఖీభవ పథకం కు సంబంధించిన రైతులకు ఈ కేవైసీ చేయడం జరుగుతుందని రైతులు వారి యొక్క ఆధార్ కార్డు తీసుకొని భూమి కలిగిన పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద బయోమెట్రిక్ పద్ధతిన ఈకేవైసీ పూర్తి చేసుకోగలరు అని, లేనియెడల ఈ పథకం కు అనర్హులుగా పరిగణిస్తారని ఉలవపాడు మండల రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## సీట్లు పొందిన వారు బిఆర్ అంబేద్కర్ గురుకులంలో తక్షణమే చేరాలి



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జూన్ 13)

చీమకుర్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ చేరేందుకు అర్హత సాధించిన విద్యార్థులు తక్షణమే చేరాలని చీమకుర్తి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులం స్కూల్ ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాఠశాలలో సీట్ ఖరారు చేసుకోవాల్సిందిగా కోరారు. పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు.

## టైలర్స్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 13)

ఒంగోలు నగరానికి వచ్చిన ఏపీ టైలర్స్ సహకార సంఘాల ఫెడరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ ఆకాశపు స్వామిని రాష్ట్ర టైలర్స్ అధ్యక్షులు విక్కీ నాగేశ్వరరావుని ఒంగోలు నగర టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టైలర్స్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ కె హుస్సేన్, ఉపాధ్యక్షులు ఎస్.కె ఆల్తాఫ్, ప్రధాన కార్యదర్శి పంచేటి నాగేశ్వరరావు, కాశి, ఉపాధ్యక్షుడు ఏవీ భాస్కర్ రావు, ఉపాధ్యక్షుడు సిహెచ్ సురేష్ (గణేష్ టైలర్), ఉపాధ్యక్షుడు ఎస్కే మస్తాన్, ఎస్కే శ్రీను బాషా, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జనిగర్ల నాగరాజు జన్మదిన వేడుకలు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 13)

కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనలతో గుడ్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆఫీసులో ఏర్పాటుచేసిన కేకు నాగరాజుతో కట్ చేయించి పార్టీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ళ రవిచంద్ర, పొడపాటి మహేష్, మేకల మాల్యాద్రి, పోలుగంగు కృష్ణ, చిత్తారి మల్లికార్జున, చందూరి శ్రీను, ముచ్చు వేణు, సవిడిబోయిన వెంకట కృష్ణ, గుమ్మా శివ, పసుపులేటి రమణయ్య, అత్తింటి శ్రీనివాసులు, మన్నం కృష్ణ, రామరాజు, శేఖర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





# టీవీఎస్ వారి ప్రైమ్ మోటార్స్ షాప్ ప్రారంభోత్సవం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 13)

శుక్రవారం మధ్యాహ్నం ఒంగోలు నగరంలోని వుడ్ కాంప్లెక్స్‌లో టీవీఎస్ వారి ప్రైమ్ మోటార్స్ షాప్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా ప్రైమ్ మోటార్స్ ఓనర్స్ చెన్నుపాటి శ్రీనివాసరావు, మాదాల ప్రియతం, మాదాల గౌతమ్ ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. ప్రైమ్ మోటార్స్ నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, నగర ప్రజలకు ఉపయోగపడే విధంగా, సీఎన్‌జీ గ్యాస్‌తో త్రీ వీలర్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలకు జీవనోపాధికి బాగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టు వీలర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు దాయినేని ధర్మ, బండారు మదన్, దంత వైద్య నిపుణులు నామినేని కిరణ్, షో రూమ్‌లో పనిచేసే సేల్స్ మెన్‌లు రాంబాబు, దాసరి శివ, తదితరులు పాల్గొన్నారు.








On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com